సాక్షి ఖమ్మం

శుక్రవారం । 12 । ఏప్రిల్ । 2024



పల్లెల్లోనే నీటి పరీక్షలు

గ్రామాల్లో సరఫరాచేసే తాగునీటి నాణ్యతను పరీక్షించేందుకు ప్రభుత్వం 'క్లోరోస్కోప్' కిట్లను పంపిణీ చేసింది. 10లో



పెరిగిన పత్తి విత్తనాల ధర

ఉమ్మడి జిల్లాలో వరి తర్వాత రైతులు ఎక్కువగా సాగు చేసే పత్తి విత్తనాలు ధర ఈ ఏడాది స్వల్పంగా పెరిగింది. 10లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 38° / 25°

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. కొన్నిచోట్ల మధ్యాహ్నానికి ఎండ పెరిగి వడగాలలు వీస్తాయి.

రమజాన్..!

- ఘనంగా ఈద్ ఉల్ ఫితర్
- దర్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



నెల రోజుల పాటు కఠిన ఉపవాస దీక్ష ఆచరించిన ముస్లింలు గురువారం రమజాన్(ఈద్ ఉల్ ఫితర్) పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా.. ప్రవక్త చూపిన మార్గం, ఆయన బాటలో నడవాల్సిన ఆవశ్యకత, పేదలను ఆదుకోవాల్సిన బాధ్యతను మతపెద్దలు వివరించారు. అనంతరం పరస్పరం ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్న ముస్లింలు ఇళ్లకు చేరుకున్నాక స్నేహితులను ఆహ్వానించి సేమియా, తదితర ఆహార పదార్థాలతో విందు ఏర్పాటుచేశారు. ఖమ్మం గొల్లగూడెం లోని ఈద్గాలో జరిగిన ప్రార్థనకు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ నామ నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, కార్పొరేటర్ వలరాజు తదితరులు హాజరై ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఖమ్మం గాంధీచౌక్ సమీపంలోని ఈద్గాలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రార్థనకు హాజరయ్యారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంలోని గొల్లగూడెం ఈద్గాలో ప్రార్థనకు హాజరైన ముస్లింలు



ఈద్గాలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల, పక్కన ఎంపీ నామ



ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న మాజీ మంత్రి పువ్వాడ

న్యూస్‌రీల్

జమలాపురంలో ధ్వజారోహణం



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఈ సందర్భంగా స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకం చేశారు. ఆతర్వాత బ్రహ్మోత్సవాలను తిలకించేందుకుగాను ముక్కోటి దేవతలను ఆహ్వానిస్తూ గరుడ స్వామికి ప్రత్యేక పూజలు చేసి ధ్వజారోహణం నిర్వహించారు. అలాగే, గరుడ స్వామికి నివేదించిన ప్రసాదాన్ని సంతానం కోరుకునే దంపతులకు అందజేశారు. అనంతరం గోపూజ, అగ్ని ప్రతిష్టాపన, పల్లకీ సేవ జరిగాయి. ఇక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లను మయూర వాహనంపై గిరి ప్రదక్షణ చేయించారు. ఆలయ చైర్మన్ ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు విజయదేవశర్మ, మురళీమోహన్‌శర్మ, రాజీవ్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

పూలేకు నివాళులర్పించిన కలెక్టర్



పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: మహాత్మా జ్యోతిబా పూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఖమ్మంలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పూలే అందించిన సేవలు, మహిళల విద్యాభివృద్ధి కోసం అనితర సాధ్యమైన రీతిలో కొనసాగించిన కృషిని వివరించారు. ఖమ్మం ఆర్డీఓ జి.గణేష్‌తో పాటు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో సింగరేణి డైరెక్టర్ తనిఖీ



సీహెచ్‌పీలో వివరాలు తెలుసుకుంటున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండలం జేవీఆర్ ఓసీలోని సీహెచ్‌పీని సింగరేణి డైరెక్టర్(ఈఅండ్ ఎం) డి.సత్యనారాయణరావు గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన 2,400 టన్నుల సామర్థ్యం కలిగిన సర్ఫేస్ బంకర్, ఫ్లప్ ఫీడర్లు, బెల్ట్ కన్వేయర్‌ను పరిశీలించారు. బంకర్, కన్వేయర్ బెల్ట్ వెంట బొగ్గు కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించడంతో పాటు దుమ్ము లేవకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే, సీహెచ్‌పీ పరిసరాల్లో గాలి కాలుష్యం లేకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఆపై యంత్రాల పనితీరు, విడిభాగాల నిల్వలపై ఆరా తీసిన ఆయన.. సరైన విడిభాగాలు ఉపయోగించి యంత్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం (ఈఅండ్‌ఎం) కే.వీ.రావు, కిష్టారం పీఓ ఎం.వీ.నర్సింహారావుతో పాటు పీఈ రమణరావు, ఎస్ఈ కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి సువర్ణ పుష్పార్చన

పాల్వంచరూరల్ : పాల్వంచ మండల పరిధిలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ వసంత నవరాత్రోత్సవాల్లో మూడో రోజైన గురువారం అమ్మవారికి సువర్ణ పుష్పార్చన వేడుక వైభవంగా నిర్వహిచారు. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. 108 సువర్ణ పుష్పాలతో అర్చన అనంతరం నాదనీరాజనం, శ్రీచక్రార్చన, సూర్యనమస్కారాలు, సూక్తపారాయణం, హోమాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష కుంకుమార్చన, మంత్రపుష్పం సమర్పించారు. ఆ తర్వాత భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ సుదర్శన్, అర్చకులు పాల్గొన్నారు.

ఎలాగైనా కొట్టాల్సిందే..



ఖమ్మంలోని జిల్లా గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

డీఎస్సీకి సిద్ధమవుతున్న నిరుద్యోగులు

- కొనసాగుతున్న టెట్, డీఎస్సీ దరఖాస్తుల ప్రక్రియ
- జిల్లాలో 575 పోస్టులకు నోటిఫికేషన్
- ఆరేళ్ల తర్వాత వెలువడడంతో పోటాపోటీ

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: టెట్ అర్హత సాధించిన డీఈడీ, బీఎడ్ అభ్యర్థులు డీఎస్సీలో సత్తా చాటేందుకు కుస్తీ పడుతున్నారు. ఇటీవల వెలువడిన నోటిఫికేషన్‌లో జిల్లాలో 575 పోస్టులు ఉన్నట్లు వెల్లడైంది. ఇందులో ఎస్జీటీ పోస్టులే 363 వరకు ఉన్నాయి. కాగా, డీఎస్సీ దరఖాస్తు ప్రక్రియ జూన్ 20తో ముగియనుండగా టెట్ దరఖాస్తు గడువు ఈనెల 20 వరకు పొడిగించారు. తొలుత టెట్ నిర్వహిస్తే క్వాలిఫై అయిన అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత వస్తుంది. ఇక జూలై 17 నుంచి 31 వరకు డీఎస్సీ నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో ఈసారి ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో అభ్యర్థులు రాత్రింబవళ్లు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.

పోటాపోటీ..

చివరిసారిగా 2017 ఆగస్టులో ప్రభుత్వం డీఎస్సీ నిర్వహించింది. మళ్లీ ఆరేళ్ల తర్వాత నోటిఫికేషన్ వెలువడింది. దీంతో టెట్ అర్హత సాధించిన డీఈడీ, బీఎడ్ అభ్యర్థుల మధ్య పోటీ ఎక్కువగా ఉంది. నోటిఫికేషన్‌లో తక్కువ పోస్టులు ఉండడంతో అభ్యర్థులు ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా సిద్ధమవుతున్నారు. ప్రభుత్వం వెల్లడించిన జాబితా ప్రకారం స్పెషల్ ఎడ్యుకేషన్, తెలుగు, ఉర్దూ మాధ్యమాల్లో ఎస్జీటీ పోస్టులు 363 ఉన్నాయి. డీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత సాధించిన అభ్యర్థులంతా ఈ పోస్టులకు అర్హులు. అలాగే మిగిలిన స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బయాలజీ, సోషల్, గణితం పోస్టులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో పోస్టుల సంఖ్య ఆధారంగా అభ్యర్థులు ప్రిపరేషన్‌కు దిగారు. కొందరు సొంతంగా చదువుకుంటుండగా.. మరికొందరు కోచింగ్ సెంటర్ల బాట పట్టారు. డీఎస్సీతో పాటు ఇతర పోస్టులకు సిద్ధమవుతున్న అభ్యర్థులతో గ్రంథాలయాలు కిటకిటలాడుతున్నాయి.

సబ్జెక్టుల వారీగా నోటిఫికేషన్‌లో చూపిన పోస్టులు

సబ్జెక్టు	పోస్టులు
ఎల్పీ (హిందీ)	11
తెలుగు	07
పీఈటీ	10
ఎస్ఏ (బయాలజీ)	42
ఇంగ్లిష్	09
హిందీ	10
గణితం	35
పీఈడీ	04
ఫిజిక్స్	01
సోషల్	59
తెలుగు	16
స్పెషల్ ఎడ్యుకేషన్	08
ఎస్జీటీ తెలుగు	321
ఉర్దూ	13
స్పెషల్ ఎడ్యుకేషన్	29
మొత్తం	575

టెట్ ఉంటే డీఎస్సీ..

టెట్ దరఖాస్తు గడువు పెంచిన ప్రభుత్వం వచ్చే నెల 20 నుంచి జూన్ 3 వరకు పరీక్ష నిర్వహించనుంది. ఈ టెట్‌లో అర్హత సాధించిన వారే కాక గతంలో ఉత్తీర్ణత సాధించి మళ్లీ స్కోరింగ్ పెరిగిన అభ్యర్థులు డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అవకాశముంటుంది. జూన్ 20వరకు ప్రభుత్వం డీఎస్సీ దరఖాస్తులు స్వీకరిస్తుంది. టెట్ ఫలితాలు వెల్లడైతే క్వాలిఫై అయిన అభ్యర్థులు డీఎస్సీకి దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగా డీఈడీ, బీఈడీ పూర్తి చేసే వారు టెట్‌తో పాటు డీఎస్సీకి అర్హులయ్యేలా తేదీలు నిర్ణయించడంతో డీఎస్సీకి దరఖాస్తులు గణనీయంగా పెరుగుతాయని భావిస్తున్నారు.

ఖాళీ పోస్టులు 888 ..

జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 544 పోస్టులు, ఉన్నత పాఠశాలల్లో 344 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా 888 పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ డీఎస్సీ ప్రకటన మాత్రం 575 పోస్టులతోనే వెలువడింది. మిగిలిన 313 పోస్టులను డీఎస్సీలో చూపలేదు. అయితే, ఆయా పోస్టులను పదోన్నతుల కోసం మినహాయించినందున ఖాళీల్లో చూపలేదని తెలుస్తోంది. మొత్తంగా నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో సోషల్, బయాలాజికల్ సైన్స్, గణితం పోస్టులే ఎక్కువగా ఉన్నాయి.

పూడికతీత పనుల పరిశీలన



పనిప్రదేశంలో సౌకర్యాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మంరూరల్: మండలంలోని గోళ్లపాడులోని చెరువు పూడికతీత పనులను అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పని ప్రదేశంలో కూలీలకు తాగునీరు సమకూర్చడంతో పాటు ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా, లేవా అని ఆరా తీశారు. ఎండల నేపథ్యాన కూలీలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌డీఓ సన్యాసయ్య, ఎంపీడీఓ కుమార్, ఏపీఓ శ్రీదేవితో పాటు సిబ్బంది కిరణ్, రమాదేవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పనిప్రదేశాల్లో జాగ్రత్త

రఘునాథపాలెం: ఎండలు పెరుగుతున్నందున ఉపాధి హామీ కూలీలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఆర్‌డీఓ సన్యాసయ్య సూచించారు. రఘునాథపాలెం మండలంలోని దారేడు, పడమటితండా పంచాయతీల్లో జరుగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించి ఉద్యోగులకు సూచనలు చేశారు. అలాగే, నర్సరీలను పరిశీలించిన డీఆర్‌డీఓ మొక్కలను కాపాడడంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. ఏపీడీ శ్రీదేవి, ఎంపీడీఓ అశోక్‌కుమార్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డితోపాటు ఉమారాణి, రాంబాబు, పద్మయ్య నాయుడు, దీపక్, సౌజన్య, మదన్, వెంకటేశ్వర్లు, రాధిక తదితరులు పాల్గొన్నారు.



డ్రాగన్.. కాపాడుకునేదెలా ?!

ఖమ్మం బల్లేపల్లి చెరువు సమీపాన అర ఎకరం భూమిలో రైతుబంధు సమితి మాజీ కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు ఇటీవల డ్రాగన్‌ఫ్రూట్ తోట సాగు చేశారు. అయితే, వారం రోజులుగా ఉష్ణోగ్రత పెరుగుతుండడంతో మొక్కలను రక్షించడానికి నానా తంటాలు పడుతున్నారు. సూర్యప్రతాపం నేరుగా మొక్కలపై పడకుండా చుట్టూ సున్నం దట్టించారు. అంతేకాక స్తంభాల ఆధారంగా నాటిన మొక్కలకు చుట్టూ చీరలు కట్టించారు. ఓ వైపు ఎండల తీవ్రతతో భూగర్భజలాలు అడుగంటగా.. ఎండ వేడి నుంచి డ్రాగన్ ఫ్రూట్ తదితర తోటలను కాపాడుకునేందుకు జిల్లాలోని పలు ప్రాంతాల రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. – ఖమ్మంఅర్బన్



డ్రాగన్ ఫ్రూట్ మొక్కల చుట్టూ కట్టిన చీరలు

దాసాంజనేయ ఆలయంలో దేవానాథ జీయర్ పూజలు



మాట్లాడుతున్న దేవానాథ జీయర్

దుమ్ముగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలో గల శ్రీ దాసాంజనేయ స్వామివారి ఆలయాన్ని శ్రీశ్రీశ్రీ దేవానాథ జీయర్ స్వామి గురువారం సందర్శించారు. ఆలయ కమిటీ సభ్యులు జీయర్ స్వామికి ఘనంగా స్వాగతం పలకగా, ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవానాథ జీయర్ స్వామి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో భద్రాచలంలోని చిన జీయర్ మఠం ఇన్‌చార్జ్ గట్టు వెంకటాచార్యులు, కమలా రాజశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పెరిగిన ఓటర్లు లక్షకు పైగానే..

2019తో పోలిస్తే ఓటర్ల సంఖ్య పైపైకి

ఖమ్మం సహకారనగర్: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణాన ఇప్పటికే ఓటర్ల తుది జాబితా విడుదల చేశారు. ఈ జాబితా ఆధారంగా ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరధిలో 2019 ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం 1,10,720మంది ఓటర్లు పెరిగారు.

ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు

ఖమ్మం లోక్‌సభ స్థానం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని ఐదింటితో పాటు భద్రాద్రి జిల్లాలో కొత్తగూడెం, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఇందులోకి వస్తాయి. ఈమేరకు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం 16,23,814 మంది ఓటర్లు నమోదయ్యారు. వీరిలో పురుషులు 7,84,043మంది, మహిళలు 8,39,640మంది ఉండగా.. ఇతరులు 131మంది ఉన్నారు. 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 15,13,094మంది ఓటర్లు ఉండగా.. ప్రస్తుతం 1,10,720మంది పెరిగినట్లు తుది జాబితా ఆధారంగా తేలింది. అయితే, ఓటర్ల నమోదుకు మరో ఐదు రోజుల గడువు ఉన్నందున ఈ సంఖ్య ఇంకాస్త పెరిగే అవకాశముంది.

పోలింగ్ కేంద్రాలు

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో 16,23,814 మంది ఓటర్లు ఉండగా 1,896 పోలింగ్ కేంద్రాలను 1,083 ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నారు. గతంలో 15,13,094మంది ఓటర్లకు 1,801పోలింగ్ కేంద్రాలను 950 ప్రాంతాల్లో నెలకొల్పారు. ఇప్పుడు ఓటర్ల సంఖ్య లక్షకు పైగా పెరగడంతో పోలింగ్ కేంద్రాలు సైతం పెంచాల్సి వచ్చింది. కాగా, ఓటరు నమోదు ఆవశ్యకతపై అధికార యంత్రాంగం విస్తృతంగా అవగాహన కల్పించడంతో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగినట్లు భావిస్తున్నారు.



ఓటర్ల వివరాలు ఇలా...

నియోజకవర్గం	2019లో..	ప్రస్తుతం
ఖమ్మం	2,93,600	3,22,259
పాలేరు	2,16,622	2,39,653
మధిర	2,10,358	2,21,567
వైరా	1,83,286	1,92,670
సత్తుపల్లి	2,30,426	2,42,767
కొత్తగూడెం	2,28,597	2,46,251
అశ్వారావుపేట	1,50,205	1,58,647
మొత్తం	15,13,094	16,23,814

విధులు నిర్వర్తించే చోటే ఓటు

- ఈసారి ఉద్యోగులకు అవకాశం
- పోలింగ్ కేంద్రంలోనే ఓటు వేసే వెసులుబాటు
- ఇతర చోట విధులు కేటాయిస్తే పోస్టల్ బ్యాలెట్



ఖమ్మం సహకారనగర్: ఎన్నికల సంఘం పోలింగ్ తీరులో నానాటికీ ఆధునికతను తీసుకొస్తోంది. అందివచ్చిన అవకాశాలను ఉపయోగిస్తున్న క్రమంలో ఈసారి మరో అడుగు ముందుకేసింది. ఈ నిర్ణయం ద్వారా ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రభుత్వ ఉద్యోగులు పనిచేసే పోలింగ్ కేంద్రంలోనే ఓటు వేసే వెసులుబాటు లభించనుంది. ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్(ఈడీసీ)తో ఎన్నికల విధులు నిర్వర్తించే పోలింగ్ కేంద్రం నుంచే ఓటు వేసే అవకాశం రావడంతో పోస్టల్ బ్యాలెట్ తిప్పలు తప్పనున్నాయి.

అసెంబ్లీ మారినా..

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉద్యోగులు విధులు నిర్వర్తించే నియోజకవర్గం, వారి స్వస్థలాన్ని పరిగణనలోకి తీసుకుని పోలింగ్ డ్యూటీ కేటాయిస్తారు. దీంతో పోలింగ్ జాబితాలో పేరున్న చోట ఓటు హక్కు వినియోగించుకునే అవకాశముండదు. తద్వారా విధులు కేటాయించిన ఉద్యోగులంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయాల్సి ఉంటుంది. కానీ లోక్‌సభ ఎన్నికలకు వచ్చేసరికి ఏడు నియోజకవర్గాల పరిధిలో ఎక్కడ విధులు కేటాయించినా పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోనే కావడంతో అభ్యర్థులు వారే ఉంటారు. తద్వారా ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏ పోలింగ్ బూత్‌లో విధులు నిర్వర్తించినా ఈవీఎంలోనే ఓటు వేసే అవకాశం ఇచ్చారు.



ఎన్నికల విధులు కేటాయించగానే జారీ చేసేఈడీసీ (ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్) ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

వీరికి మాత్రం పోస్టల్ బ్యాలెట్లు

ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని వివిధ శాఖల్లో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఇతర పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఎన్నికల విధులు కేటాయించే అవకాశముంది. దీంతో వీరికి మాత్రం గతంలో మాదిరిగానే పోస్టల్ బ్యాలెట్లు ఇస్తారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు ఎవరైనా వస్తే వారు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. వీరు సంబంధిత ఆర్‌ఓ కార్యాలయంలో ఏర్పాటుచేసే బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేయాలి. కాగా, పోలింగ్‌కు విధులు కేటాయించిన పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు రెండో విడత శిక్షణ ఇచ్చే సమయానికి ఈవీఎంల ద్వారా ఎందరు ఓటు వేస్తారు, పోస్టల్ బ్యాలెట్ ఎందరు వినియోగించుకుంటారనే లెక్క తేలనుంది.

క్లుప్తంగా

నూతన సంవత్సర పంచాంగ ఆవిష్కరణ



పంచాంగాలను ఆవిష్కరిస్తున్న శ్రీవైష్ణవ సేవా సంఘం సభ్యులు

ఖమ్మంగాంధీచౌక్: శ్రీవైష్ణవ సేవా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కమాన్‌బజార్ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శ్రీ క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శేషభట్టర్ రఘునాథాచార్యులు మాట్లాడుతూ.. క్రోధి నామ సంవత్సరంలో ప్రతీ ఒక్కరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి ప్రజలందరినీ అనుగ్రహించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి రవికిరణాచార్యులు, కోశాధికారి వేదాంతం ఫణి, కార్య నిర్వాహక అధ్యక్షుడు భార్గవాచార్యులు, సహాయ కోశాధికారి రామకృష్ణ, సభ్యులు రవికిరణ్, గోపాల్, శ్రీనివాసాచార్యులు, శేషాచార్యులు, మధు తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో సహకరించండి...

మధిర: మధిరకు చెందిన టీడీపీ నాయకులను ఖమ్మం ఎంపీ, బీఆర్‌ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు గురువారం కలిశారు. లోక్‌సభ ఎన్నికల్లో తనకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మధిరలోని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథంతో పాటు పలువురు నాయకులతో సమావేశమై మాట్లాడారు. అనంతరం నామాను నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి జీవన్ కుమార్, మల్లాది హన్మంతరావు, చేకూరి శేఖర్‌బాబు, వంకాయలపాటి వెంకట నాగేశ్వరరావు, వాసిరెడ్డి ఉపేందర్, వేమూరి సునీల్, వేల్పుల కొండ, మైనీడి జగన్, పాశం రామనాథం, ఎడవల్లి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో ఒకరికి గాయాలు

అశ్వారావుపేట (ములకలపల్లి) : తేనెటీగల దాడిలో ఓ వ్యక్తి గాయపడిన సంఘటన పూసుగూడెం పంచాయతీ పరిధిలోని ఒడ్డురామవరంలోని సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ వద్ద గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన సోమ్‌నాథ్ కొంతకాలంగా ఇక్కడ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం పంప్‌హౌస్‌లో పనిచేస్తుండగా, తేనెటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. గాయపడగా చికిత్స నిమిత్తం పాల్వంచ ఆస్పత్రికి తరలించారు.

నలుగురు యువకుల రిమాండ్

జూలూరుపాడు: మండలంలోని మాచినేనిపేటతండా గ్రామానికి చెందిన నలుగురు యువకులను గురువారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మాచినేనిపేటతండాకు చెందిన భూక్యా వినోద్‌కుమార్, లకావత్ గణేష్, లకావత్ శశి కుమార్, గుగులోత్ విజయ్ కుమార్‌లు తండాలో బుధవారం ఆర్టీసీ బస్సు ఆపి, డ్రైవర్‌ను దుర్భాషలాడి, ఓ ప్రయాణికుడిపై దాడి చేసిన విషయం విదితమే. బస్సు అద్దాలు ధ్వంసం చేసి, రూ. 21 వేలు నష్టం కలిగించారు. వారిని అరెస్ట్ చేసి కొత్తగూడెం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చగా, 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ జీవన్ రాజు తెలిపారు.

ఔట్ పోస్టును ఢీకొన్న లారీ




పడిపోయిన పోలీస్ ఔట్ పోస్ట్

భద్రాచలం (భద్రాచలం అర్బన్): పట్టణంలోని పాత మార్కెట్ వద్ద ఉన్న పోలీస్ ఔట్ పోస్ట్‌ను గురువారం ఓ లారీ ఢీకొట్టింది. లారీ ఐటీడీఏ రోడ్డు నుంచి అంబేడ్కర్ సెంటర్ వైపు వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగిందని స్థానికులు తెలిపా రు. ఆ సమయంలో ఔట్ పోస్టులో పోలీస్ సిబ్బంది ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ప్రమాదం జరిగాక లారీని ఆపకుండా డ్రైవర్ వెళ్లిపోయాడు. కాగా ఈ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పాల్వంచరూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలం పరిధిలోని కోడిపుంజులవాగు గ్రామపంచాయతీ పూసలతండా గ్రామానికి చెందిన అజ్మీర బిక్కులాల్ వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం కుటుంబసభ్యులతో గొడవ జరగ్గా, బిక్కులాల్ మనస్తాపం చెంది పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు 108 ద్వారా పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

గడువు సరే.. ఫీజు మాటేమిటి?

- ‘టెట్’ ఫీజు భారీగా పెంచడంపై అభ్యర్థుల ఆవేదన
- తగ్గించాలంటున్న విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు
- స్పష్టత కోసం ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల ఎదురుచూపులు



ఖమ్మం సహకారనగర్: ఏళ్లుగా ఉద్యోగాలు రాక ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం టెట్, ఆపై డీఎస్సీ నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో ఆశలు చిగురించాయి. కానీ టెట్ దరఖాస్తు ఫీజు పెంపు భారీగా పెంచడం వారిని ఆందోళనకు గురిచేస్తోంది. మూడు రెట్లకు పైగా ఫీజు పెంచడంతో ఓపక్క పోటీ పరీక్షల కోచింగ్, అద్దె గదుల్లో అవస్థ పడుతున్న నిరుద్యోగులు తమపై మరింత భారం పడుతుందని చెబుతున్నారు. ఇటీవల టెట్ దరఖాస్తు గడువు పెంచుతూ నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం ఫీజు తగ్గింపు విషయంలో నిరుద్యోగుల వినతిని పరిగణనలోకి తీసుకోకపోవడంపై పెదవి విరుస్తున్నారు.

ఫీజుల పెంపుతో నిరుత్సాహం

టెట్ (టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్) ఫీజు పేపర్‌కు రూ.300, రెండు పేపర్లు రాస్తే రూ.400 చెల్లించాల్సి ఉండేది. కానీ ఈసారి ఒక పేపర్ అయితే, రూ.వెయ్యి, రెండు పేపర్లకు అయితే రూ.2వేలుగా ఫీజు నిర్ణయించారు. దీంతో టెట్ నోటిఫికేషన్ వచ్చిందని సంతోషపడాలో.. ఫీజు భారం పడిందని బాధ పడాలో తెలియని పరిస్థితిలో నిరుద్యోగులు పడిపోయారు. కాగా, టెట్ దరఖాస్తు గడువు ఈనెల 10వ తేదీతో ముగియగా 20వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఫీజు విషయంలో ఎలాంటి మార్పు లేకపోవడంతో ఔత్సాహిక అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఏళ్ల తరబడి శిక్షణ, పుస్తకాలు, అద్దె గదులకు రూ.వేలల్లో వెచ్చించిన తమపై మరింత భారం మోపడం సరికాదని అంటున్నారు.

స్పష్టమైన ఆదేశాలేవి?

టెట్ విషయంలో ఉపాధ్యాయులకు స్పష్టమైన ఆదేశాలు లేవని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు. ఎల్‌ఎఫ్‌ఎల్(ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పీఎస్ హెచ్‌ఎం) పేపర్–1 రాయాలా.. 2 రాయాలా, స్కూల్ అసిస్టెంట్లు (ఎస్‌ఏ) రాసేందుకు పేపర్–2లో గణితం, సోషల్ మాత్రమే ఉన్నాయి. అలాంటప్పుడు బయాలజీ, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు గణితం పరీక్ష, సోషల్ పరీక్ష లాంగ్వేజీ ఉపాధ్యాయులు ఎలా రాస్తారనే ప్రశ్నలు వస్తున్నాయి. ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇలా రకరకా ల సందేహాలు ఉండడంతో ఉపాధ్యాయులు ఎక్కువ మంది టెట్‌కు దరఖాస్తు చేసుకోలేదు. ఈ నేపథ్యాన పాఠశాల విద్యాశాఖ అధికారులు స్పష్టత కోసం నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ)కి రాసిన లేఖకు సమాధానం రావాల్సి ఉంది.

అర్హులు వీరే..

టెట్ రెండు పేపర్లుగా ఉంటుంది. పేపర్–1 డీఈడీ(టీటీసీ), తత్సమాన కోర్సులు పూర్తిచేసిన వారు, పేపర్–2 బీఈడీ, టీపీటీ, హెచ్‌పీటీ పూర్తి చేసిన వారిని అర్హులుగా ప్రకటించారు. అయితే, ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)లు ఎస్‌ఏ(స్కూల్ అసిస్టెంట్)లుగా పదోన్నతి పొందాలంటే పేపర్–2 రాయాలని సూచించింది. టెట్ 150మార్కులకు నిర్వహిస్తుండగా జనరల్ కేటగిరీ అభ్యర్థులైతే, బీసీలు 75మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులైతే 60మార్కులు సాధిస్తే క్వాలిఫై అయినట్లు ప్రకటిస్తారు. ఇందులో మంచి మార్కులు సాధించిన వారికి డీఎస్సీలో 20శాతం వెయిటేజీ లభించే అవకాశముంది.

ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా నిర్వహించాలి



ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. లేనిపక్షంలో ప్రత్యేకంగా టెట్ నిర్వహించాలి. 2010కి ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినహాయింపునిచ్చారు. ఇప్పుడు కూడా అదే విధానం కొనసాగించాలి.

– పారుపల్లి నాగేశ్వరరావు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

దరఖాస్తు ఫీజు తగ్గించాలి



టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించి నిరుద్యోగులపై భారం పడకుండా చూడాలి. ఒక పేపర్ రూ.వెయ్యి, రెండు పేపర్లకు అయితే రూ.2వేలుగా నిర్ణయించడం సరికాదు. ఇకనైనా ప్రభుత్వం పునరాలోచించి ఫీజు తగ్గించడమే కాక జిల్లా కేంద్రంలోనే పరీక్ష కేంద్రం ఏర్పాటుచేయాలి.

– కొరకొప్పు రామారావు, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు

సమాధులు తొలగించి భూ స్వాధీన యత్నం



సమాధుల తొలగింపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య తదితరులు

ఇల్లెందు: కొత్త బస్టాండ్ సమీపంలోని బందెల మల్లయ్య కుంట ప్రాంతంలో వందల ఏళ్ల నుంచి ఉన్న క్రైస్తవుల సమాధుల తొలగింపు పనులు చేపట్టారు. భూమి తాము కొనుగోలు చేశామంటూ ప్రొక్లెయినర్‌తో ధ్వంసం చేశారు. మూడు రోజులుగా చెత్తా చెదారం తొలగిస్తున్నారు. దీంతో గురువారం చర్చి కమిటీ సభ్యులు అక్కడికి చేరుకుని అడ్డుకోగా, ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. తొలగింపు ఆపకపోవడంతో చర్చి కమిటీ సభ్యులు సమస్యను ఎమ్మెల్యే కోరం కనకయ్యకు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. తహసీల్దార్ వచ్చి సర్వే చేసే వరకు పనులు నిలిపి వేయాలని చెప్పారు.

యువతికి న్యాయం చేయాలి..

నేలకొండపల్లి: యువతిని ప్రేమించి, పెళ్లి చేసుకోకుండా మోసం చేసిన యువకుడిపై చర్యలు తీసుకోవాలని ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. మండలంలోని గువ్వలగూడెంకు చెందిన రాము, సదరు యువతి మూడేళ్లగా ప్రేమించుకుంటుండగా, పెళ్లి విషయానికొచ్చేసరికి ఆయన నిరాకరించాడు. దీంతో బాధితురాలు ఈనెల 9వ తేదీన రాము ఇంటి ఎదుట ధర్నా చేసింది. అదేరోజు పోలీసులకు ఫిర్యాదు చేయగా, గురువారం ఆమె యువతి బంధువులు పెద్దసంఖ్యలో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుని ధర్నాకు యత్నించాడు. పోలీసులు సర్దిచెప్పడంతో యువతికి న్యాయం చేయాలంటూ విన్నవించి వెనుదిరిగారు.

పోలీస్‌స్టేషన్‌లో దాడికి యత్నం

నేలకొండపల్లి: గ్రామంలో జరిగిన ఘర్షణపై బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు రాగా... అక్కడ కూడా ఆయనపై మరోమారు దాడికి యత్నించారు. ఈఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చెరువుమాధారానికి ఇమామ్, అదే గ్రామానికి చెందిన అలీం, హాకీం గురువారం పరస్పరం దాడి చేసుకున్నారు. దీంతో వీరిపై నేలకొండపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఇమామ్‌పై స్టేషన్‌లో ఆవరణలో కూడా దాడికి యత్నిస్తూ వాగ్వాదానికి దిగారు. పోలీసులు సర్దిచెబుతున్నా ఆగకుండా అరుపులు, కేకలతో వీరంగం సృష్టించారు. ఈమేరకు తమ విధులను అడ్డుకున్నట్లు కానిస్టేబుల్ చేసిన ఫిర్యాదుతో అలీం, హాకీంపై కేసు నమోదు చేసినట్లుఎస్సై తోట నాగరాజు తెలిపారు. అలాగే, గ్రామంలో జరిగిన ఘర్షణపై పరస్పరం పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారు.

కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా ఉద్యమం

రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవ సభలో రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్



జెండా ఆవిష్కరిస్తున్న పోతినేని సుదర్శన్, పక్కన నాయకులు

ఖమ్మం మయూరిసెంటర్: కార్పొరేట్ వ్యవసాయానికి వ్యతిరేకంగా రైతులు ఉద్యమించాలని ఆల్ ఇండియా కిసాన్ సభ(ఏఐకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్ పిలుపునిచ్చారు. రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని సుందరయ్య భవన్‌లో గురువారం ఆయన జెండా ఆవిష్కరించారు. అనంతరం సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో సుదర్శన్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతుల సమస్యల పరిష్కారం కోసం అనేక ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించామని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నల్లచట్టాలకు వ్యతిరేకంగా పెద్దఎత్తున జరిగిన పోరాటంలో ఏఐకేఎస్ కీలక పాత్ర పోషించిందన్నారు. అయితే, రైతుల పోరాటానికి తలొగ్గిన మోదీ ప్రభుత్వం నల్ల చట్టాలను రద్దు చేసినా.. మళ్లీ దొడ్డిదారిన అమలుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. ఇందులో భాగంగా వ్యవసాయంపై సబ్సిడీల్లో కోత విధిస్తూ రైతులకు ఇబ్బంది పెడుతుండడమే కాక పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలేదని విమర్శించారు. రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్‌లో జరిగే ఉద్యమాల్లో రైతులంతా సంఘటితమై పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసిరెడ్డి వరప్రసాద్, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, ఆర్.ప్రకాష్, బోడపట్ల సుదర్శన్, పొన్నెకంటి సంగయ్య, ప్రతాపనేని వెంకటేశ్వరరావు, మెరుగు రమణ, నందిపాటి మనోహర్, పగడాల నాగేశ్వరరావు, నెల్లూరి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

యాదన్నకు మాస్‌లైన్ నివాళి



మాట్లాడుతున్న రంగారెడ్డి

ఇల్లెందురూరల్: విప్లవ గేయాలతో అలరించిన యాదన్నకు సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు నివాళులర్పించారు. మండలంలోని సంజయ్‌నగర్‌లో గురువారం నిర్వహించిన యాదన్న సంతాప సభలో పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి, నాయకులు రాయల చంద్రశేఖర్, చిన్నచంద్రన్న, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడారు. ఇల్లెందు ప్రాంతంలో సమస్యలపై రాజీలేని పోరాటాలు చేసిన యాదన్న ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. కళాకారుడిగా గ్రామాల్లో డప్పు, కోలాటం బృందాలను తీర్చిదిద్దారని గుర్తుచేశారు. నాయకులు చంద్ర అరుణ, వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, నాయిని రాజు, ఈసం శంకర్, యాకూబ్‌షావలి, పూనెం కుమార్, బుర్ర వెంకన్న, పృథ్వి, న్యూడెమోక్రసీ నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, రాంసింగ్, విశ్వనాథం, బీఆర్‌ఎస్ నాయకులు జనగం కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ పండుగ వేళ విషాదం

మసీద్‌కు వెళ్తుండగా గుండెపోటు, ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి



అక్బర్ (ఫైల్)

సత్తుపల్లిరూరల్: ముప్పై రోజుల పాటు ఉపవాస దీక్ష ఆచరించిన వ్యక్తి.. రంజాన్ పర్వదినం సందర్భంగా సిద్ధమై నమాజ్‌కు వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందిన విషాద ఘటన ఇది. సత్తుపల్లి మండలం కిష్టారానికి చెందిన ఎస్.కే.అక్బర్(50) రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసదీక్ష ఆచరించాడు. ఇక గురువారం పండుగ సందర్భంగా కుటుంబీకులతో పాటు స్నేహితులకు సరిపడా సేమియా, ఇతర వంటకాలు సిద్ధం చేయించిన ఆయన ఇంటి సమీపంలోనే ఉన్న మసీద్‌లో నమాజ్‌కు బయలుదేరాడు. ఇంతలోనే ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయాడు. దీంతో కుటుంబసభ్యులు ఆయనను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అంతా రంజాన్ పండుగ జరుపుకుంటున్న వేళ అక్బర్ మృతితో ఆయన కుటుంబంతో పాటు గ్రామంలో విషాదం అలుముకుంది.

ప్రాణం తీసిన ఈత సరదా

బావిలో మునిగి రేషన్ డీలర్ మృతి



బిక్షపతి మృతదేహం

ఇల్లెందురూరల్: మండలంలోని మామిడిగుండాల గ్రామంలో ఓ వ్యక్తి ఈత సరదా ప్రాణం మీదకు తెచ్చింది. గ్రామస్తుల కథనం ప్రకారం... మామిడిగుండాల గ్రామానికి చెందిన ఎర్రిపోతు బిక్షపతి (38) రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సమీపంలోని వ్యవసాయి బావి వద్దకు వెళ్లి, నడుముకు ఖాళీ క్యాన్ కట్టుకుని ఈత కొట్టేందుకు బావిలోకి దిగాడు. ఈత కొడుతున్న క్రమంలో క్యాన్ ఊడి బావిలో మునిగిపోయాడు. బావి సుమారు 12 మీటర్ల లోతు ఉండటంతో, అక్కడే ఈత కొడుతున్న పిల్లలు రక్షించే సాహసం చేయలేకపోరు. సమాచారం అందుకుని మాజీ సర్పంచ్ కుంజ కృష్ణ, గ్రామస్తులు అక్కడకు చేరుకుని రక్షించే ప్రయత్నం చేశారు. అయితే అప్పటికే మృతి చెందాడు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

భర్తపై భార్య, బంధువుల దాడి

ఖమ్మంరూరల్: మండలంలోని పెదతండాకు చెందిన బానోత్ మోతీలాల్‌పై ఆయన భార్య సుజాత, మామ ధరావత్ సూక్యా, బావమరిది రమేష్ గురువారం దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కూసుమంచి మండలం ఒంటిగుడిసె తండాకు చెందిన సుజాతతో గత 20 ఏళ్ల క్రితం పెదతండా వాసి మోతీలాల్‌కు వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరగగా సుజాత తన తండ్రి, సోదరుడిని పిలిపించింది. వీరు ముగ్గురు కలిసి మోతీలాల్‌పై కర్రతో దాడి చేయడంతో ముఖం, వీపుపై గాయాలయ్యాయి. ఘటనపై మోతీలాల్ ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

12 తులాల బంగారం, రూ.3లక్షల నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న ఎస్‌ఐ

కారేపల్లి: మండలంలోని సీతారాంపురం గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లోని చొరబడిన దుండగులు 12తులాల బంగారం, రూ.3లక్షల నగదు ఎత్తుకెళ్లారు. బుధవారం రాత్రి జరిగిన ఈ ఘటన వివరాలు పోలీసుల కథనం ప్రకారం.. సీతారాంపురం గ్రామానికి చెందిన సుడిగాలి భాస్కర్‌రావు కుటుంబంతో సహా బాసర వెళ్లారు. కాగా, దుండగులు బుధవారం అర్ధరాత్రి కారులో వచ్చి ఇంటి తాళం పగలకొట్టి బీరువాలో దాచిన 12తులాల బంగారం, రూ.3లక్షల నగదు అపహరించుకెళ్లారు. గురువారం ఉదయం ఇంటికి చేరుకున్న భాస్కర్‌రావు చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేయగా.. ఎస్‌ఐ రాజారాం పరిశీలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు.

భర్త హత్య కేసులో భార్య అరెస్ట్

ఖమ్మం క్రైం: ఖమ్మంలోని చెరువుకట్ట బజార్‌కు చెందిన వడ్లాణపు రాములు మంగళవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, విచారణలో భాగంగా ఆయనది హత్యేనని పోలీసులు తేల్చారు. రాములును ఆయన భార్య సత్యవతి కత్తిపీటతో ముఖంపై నరికి హత్య చేసినట్లు గుర్తించామని ఖమ్మం టూటౌన్ సీఐ బి.బాలకృష్ణ తెలిపారు. అయితే, రాములే కత్తిపీటతో ముఖంపై కొట్టుకున్నాడని నమ్మించటానికి ప్రయత్నం చేసింది. దీంతో పోలీసులు పూర్తిస్థాయిలో విచారించగా సత్యవతే కారణమని తేలగా ఆమెను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

బోనకల్: మండలంలోని నారాయణపురంలో గురువారం విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి చెందింది. గ్రామానికి చెందిన మర్సకట్ల సైదులు దుక్కిటెద్దులు పొలంలో మేస్తుండగా.. ఒక ఎద్దు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకింది. దీంతో షాక్‌కు గురైన ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. కాగా, సుమారు 50వేలు విలువైన దుక్కిటెద్దును కోల్పోవడంతో రైతు కన్నీరుమున్నీరుగా విలపించగా.. ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరాడు.

వడదెబ్బతో వృద్ధుడు మృతి

ఖమ్మంరూరల్: మండలంలోని గుదిమళ్లకు చెందిన చెరుకుపల్లి కన్నయ్య(70) వడదెబ్బతో గురువారం మృతి చెందాడు. వ్యవసాయ కూలీగా పనిచేసే ఆయన మధ్యాహ్నం పనికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

గుండెపోటుతో అర్చకుడు...



ప్రభాకరాచార్యులు (ఫైల్)

రఘునాథపాలెం: మండలంలోని వేపకుంట్ల రామాలయం అర్చకుడు నల్లావుల ప్రభాకరాచార్యులు(70) గుండెపోటుతో మృతి చెందాడు. ఏన్కూరు మండలం నాచారానికి చెందిన ఆయన గత ఇరవై ఏళ్లుగా వేపకుంట్ల రామాలయంలో అర్చకుడిగా పనిచేస్తున్నాడు. రోజులాగే బుధవారం ఉదయం గుడికి వెళ్లిన ఆయన గుండెపోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు గుర్తించారు. కాగా, ఆయన భార్య రెండేళ్ల క్రితమే మృతి చెందగా, వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...



దుర్గాప్రసాద్ (ఫైల్)

తల్లాడ: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏపీలోని కూనవరం మండలం రేపాక గ్రామానికి మిర్చి వ్యాపారం కోసం మినీ వ్యాన్‌లో ఈనెల 2న మండలంలోని అన్నారుగూడెంకు గోపిశెట్టి దుర్గాప్రసాద్(30) వెళ్లాడు. అక్కడ వ్యాన్ అతి వేగంగా చెట్టుకు ఢీకొనగా ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బంధువులు దుర్గాప్రసాద్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం మృతి చెందాడు. ఆయన భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

దాడి కేసులో పది మంది రిమాండ్

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో ఉగాది పండుగ రోజు జరిగిన దాడి ఘటనలో ఇరువర్గాలకు చెందిన 28 మందిపై పోలీసులు అదే రోజు కేసు నమోదు చేశారు. ఇందులో ఇరువర్గాలకు చెందిన పది మందిని గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తిరుపతిరెడ్డి తెలిపారు.

వరిగడ్డి వాము దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

పెనుబల్లి: పెనుబల్లిలో గురువారం రాత్రి వరి గడ్డి వాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన వంగా చెన్నారావు వరి గడ్డి వాము ఏర్పాటుచేయగా, ఆ పక్క నుంచి వెళ్తున్న విద్యుత్ డిప్పర్ నుండి వెలువడిన నిప్పు అంటుకుంది. దీంతో మంటలు విస్తరించకుండా స్థానికులు ప్రయత్నించారు. ఇంతలోనే సత్తుపల్లి నుంచి అగ్నిమాపక శాఖ సిబ్బంది చేరుకుని జేసీబీ సాయంతో గడ్డి వామును విడదీస్తూ మంటలను అదుపులోకి తేవడంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

క్లుప్తంగా...

ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులు



రాకెట్ లాంచర్ పడిన చోట ఏర్పడిన గుంత, విరిగిన చెట్లు

చర్ల: మావోయిస్టులను నిర్మూలించే లక్ష్యంతో పోలీసులు ఆదివాసీ గ్రామాలపై వైమానిక దాడులు చేస్తుండటం హేయనీయమని మావోయిస్టు పార్టీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ కార్యదర్శి గంగ గురువారం లేఖ విడుదల చేశారు. అందులోని వివరాల ప్రకారం.. ఈనెల 7న రాత్రి 11.45 గంటల సమయంలో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ – సుక్మా జిల్లాల సరిహద్దు పామేడు సమీపాన పాలగూడ, ఇత్తగూడ, జిల్లేరుగట్టు, గొమ్ముగూడ, కంచాల గ్రామాల్లో పోలీసులు డ్రోన్ల ద్వారా దాడులు చేశారని ఆరోపించారు. ఆయా గ్రామాలపై రాకెట్ లాంచర్లు వదలడంతో ఆదివాసీలు తీవ్రంగా ఆందోళన చెందారన్నారు. ప్రాణాలు కాపాడుకునేందుకు పరుగులు తీయాల్సి వచ్చిందని, ఇకనైనా పోలీసు బలగాలు ఆదివాసీ గ్రామాలపై దాడులను వెంటనే నిలిపివేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె లేఖతోపాటు రాకెట్ లాంచర్లు వదిలిన ప్రాంతాల ఫొటోలు విడుదల చేశారు.

రంజాన్ వేడుకల్లో పాల్గొన్న కేటీఆర్



చాదర్‌ఘాట్: మాజీ హోంమంత్రి మహమూద్ అలీ నివాసంలో జరిగిన రంజాన్ వేడుకల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. గురువారం అజంపురాలోని మహమూద్ అలీ ఇంటికి చేరుకున్న కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మహమూద్ అలీతో పాటు పలువురు మైనారిటీ నాయకులకు కేటీఆర్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

'ఆయిల్‌పామ్'..అంతంతే

- సాగులో నిర్ణీత లక్ష్యాన్ని చేరుకోని ప్రైవేట్ కంపెనీలు
- పామాయిల్ ఫ్యాక్టరీల ఏర్పాటులోనూ నిర్లక్ష్యం
- సమీక్ష చేసి అవసరమైతే కంపెనీలతో ఒప్పందాల రద్దు?



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పామ్ సాగు రాష్ట్రంలో ఆశించినస్థాయిలో పెరగలేదు. దీనిపై సర్కారు దృష్టి సారిస్తున్నా..కొన్ని కంపెనీలు మాత్రం వెనుకడుగు వేస్తున్నాయి. ఆయిల్‌పామ్ విస్తీర్ణాన్ని వచ్చే దశాబ్దంలోగా ఏకంగా 20 లక్షల ఎకరాలకు విస్తరించాలని సర్కారు లక్ష్యంగా పెట్టుకుంది.రాష్ట్రంలో ఆయిల్‌ఫెడ్ సహా 14 ప్రైవేట్ కంపెనీలకు ఆయిల్ పామ్ సాగుకు అవసరమైన బాధ్యతలు అప్పగించింది. మొత్తం 31 జిల్లాలను గుర్తించింది. కొన్నేళ్లుగా ప్రైవేట్ కంపెనీలు తమ నిర్ణీత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమవుతున్నాయి. సాగు చేయించడంలోనూ, ఆ మేరకు రైతులను ఒప్పించడంలోనూ అనాసక్తి చూపిస్తున్నాయి. మరోవైపు ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయడానికి అవసరమైన భూమిని కొన్ని కంపెనీలు సేకరించలేదు. దాదాపు మూడేళ్ల క్రితమే ఈ విషయంలో స్పష్టమైన ఆదేశాలు ఉన్నా, కంపెనీలు పట్టించుకోలేదు. ఇప్పటి వరకు భూములు కొనకపోతే ఫ్యాక్టరీలు ఎప్పుడు నిర్మిస్తారోనన్న విమర్శలు వస్తున్నాయి. ఒప్పందం ప్రకారం మూడేళ్లలోపు ఫ్యాక్టరీ నిర్మించాలి. కానీ ఈ నిబంధనను అనేక కంపెనీలు అమలు చేయడం లేదు. పంట చేతికొచ్చే సమయానికి ఫ్యాక్టరీ అందుబాటులో లేకుంటే రైతులు ఇబ్బందులు పడతారు. ఇప్పటికే కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేసిన జిల్లాల్లో పంట గెలలు అందుబాటులోకి వచ్చాయి. మరో ఏడాదిలో మరింత ఎక్కువగా అందుబాటులోకి వస్తాయంటున్నారు. ఈ నేపథ్యంలో కంపెనీలు ఇంకా నిర్లిప్తంగా ఉండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లక్ష్యాన్ని చేరుకోలేని దుస్థితి

ఆయిల్‌పామ్ సాగులో 14 కంపెనీలు తమ లక్ష్యంలో కేవలం 20 శాతం వరకే చేరుకున్నాయని అధికారులు అంటున్నారు. ప్రభుత్వరంగ సంస్థ ఆయిల్‌ఫెడ్ మినహా ఇతర ప్రైవేట్ కంపెనీల్లో పెద్దగా పురోగతి లేదు. వంట నూనెల జాతీయ పథకం (ఎన్‌ఎంఈఓ) ద్వారా కంపెనీలతో ఒప్పందాలు చేసుకొని వాటికి జిల్లాలు, అందులో భూముల సాగు లక్ష్యాలను నిర్దేశించింది. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలు స్థాపించడం, రైతులను ఒప్పించి మొక్కలు వేయడం, వారికి ప్రోత్సాహకాలు ఇవ్వడం, పంట వచ్చిన తర్వాత కొనుగోలు చేయడం వంటి వాటిని ఈ కంపెనీలు చేపట్టాలి. 2020–21లో ఒప్పందం కుదుర్చుకున్న కంపెనీలు ఇప్పటివరకు కేవలం 1,52,957 ఎకరాల్లోనే పంటలు వేయించాయి. వీటిలో టీఎస్ ఆయిల్‌ఫెడ్ 87 వేల ఎకరాల్లో..మిగిలిన సంస్థలు 65 వేల ఎకరాల్లోనే పంటలను వేయించాయి. ఈ నేపథ్యంలో సాగు లక్ష్యాన్ని చేరుకోని కంపెనీలతోపాటు ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు తీసుకోలేని కంపెనీలకు ఉద్యానశాఖ నోటీసులు జారీ చేసింది. అయితే కంపెనీలు మాత్రం సాగుకు రైతులు ముందుకు రావడం లేదంటూ వివరణ ఇచ్చాయి. ప్రైవేట్ కంపెనీలు రైతుల వద్దకు వెళ్లడానికి అవసరమైన సిబ్బందిని నియమించడంలోనూ... రైతులను ప్రోత్సహించడంలోనూ విఫలం అవుతున్నాయి. పైగా ప్రైవేట్ కంపెనీలు కావడంతో వాటిని రైతులు నమ్మడం లేదన్న చర్చ జరుగుతోంది. తమకు ప్రోత్సాహకాలు అందుతాయో లేదోనని, పంట కొనుగోలు చేయరేమోనని అనుమానపడుతున్నారు. వారి అనుమానాలను తొలగించే ప్రయత్నాలు చేయడం లేదు. ఈ నేపథ్యంలో లక్ష్యంలో 20 శాతం కూడా సాధించక పోవడంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా కంపెనీలతో సమావేశం నిర్వహించాలని, వాటి నుంచి ఆశించిన స్పందన లేకపోతే అవసరమైతే ఒప్పందాలను రద్దు చేయాలని ఆయన అన్నట్టు సమాచారం.

ప్రాణాలు తీసిన అతివేగం

- చెట్టును ఢీకొట్టిన కారు
- అక్కడికక్కడే ఇద్దరు యువకులు మృతి
- మరో ముగ్గురికి స్వల్ప గాయాలు
- సూర్యాపేట సమీపంలోని రాయినిగూడెం వద్ద ప్రమాదం



మృతుడు నవీన్ (ఫైల్)



మృతుడు సాయి (ఫైల్)



ఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన వాహనం

సూర్యాపేట: అతివేగం ఇద్దరి యువకుల ప్రాణాలను బలి తీసుకుంది. మితిమీరిన వేగంతో చెట్టును ఢీ కొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఏడుగురు యువకుల్లో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురు యువకులకి స్వల్ప గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల కేంద్రానికి చెందిన ఆరుగురు యువకులు ఎర్టిగా కారును అద్దెకు తీసుకుని సూర్యాపేటలోని వీరి స్నేహితుడు ఉదయ్‌ను కలిసేందుకు గురువారం వచ్చారు. వీరంతా బాల్యస్నేహితులు. అతడితో కలిసి కాసేపు సరదాగా పట్టణంలో తిరిగి ఉదయ్‌ను కూడా కారులో ఎక్కించుకుని కేతేపల్లికి బయలుదేరారు. సూర్యాపేట మండలంలోని రాయినిగూడెం శివారులో హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో జటంగి సాయి (17), అంతటి నవీన్ (20) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న మారగోని మహేష్, కావడి శివ, అబ్బూరి గణేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే మిగిలిన మరో ఇద్దరు యువకులు చింత మళ్ల ధనుష్ అలియాస్ బన్ని, ఉదయ్ ఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు. ధనుష్ కారును 170 స్పీడ్‌తో నడపడంతోనే అదుపు తప్పినట్టు తెలుస్తోంది. మితిమీరిన వేగంతో కారు రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీ కొట్టింది. చెట్టు విరిగిపోవడమే కాకుండా కారు నుజ్జునుజ్జయింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

గురుకుల సొసైటీల ఇష్టారాజ్యం!

ఇంటర్ బోర్డు నిబంధనల అతిక్రమణ

- వేసవి సెలవుల్లోనూ జూనియర్ కాలేజీల నిర్వహణ
- ఫస్టియర్ విద్యార్థులకు సెకండియర్ పాఠ్యాంశాల బోధన
- సెకండియర్ విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్ కోచింగ్



సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల సొసైటీలు ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలను గాలికొదిలేశాయి. వార్షిక పరీక్షలు ముగిసిన తర్వాత కాలేజీలకు సెలవులు ప్రకటించాలని ఆదేశిస్తూ తెలంగాణ రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు గత నెల 30న ఉత్తర్వులు జారీ చేసింది. మార్చి 31 నుంచి మే నెల 31వరకు రెండు నెలల పాటు వేసవి సెలవులు ఇవ్వాలని, జూన్ 1వ తేదీ నుంచి కళాశాలలు పునఃప్రారంభించాలని స్పష్టం చేసింది. కానీ ఈ నిబంధనలను పట్టించుకోని గురుకుల సొసైటీలు... పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే తరగతులు ప్రారంభించాయి. ఇంటర్మీడియ్ మొదటి సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు రెండో సంవత్సరం పాఠ్యాంశాన్ని ప్రారంభించగా... ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులకు జేఈఈ, నీట్, ఎంసెట్ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన తరగతులు నిర్వహిస్తున్నారు.

ఏయే సొసైటీలంటే..

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఎస్), తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీటీడబ్ల్యూఆర్‌ఈఎస్), మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్) ప్రస్తుతం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సీఓఈ) జూనియర్ కాలేజీలను పూర్తిస్థాయిలో నిర్వహిస్తుండగా... తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ(టీఎంఆర్‌ఈఐఎస్) మాత్రం రంజాన్ నేపథ్యంలో వచ్చే వారం నుంచి తరగతులు నిర్వహించాలని నిర్ణయించింది.

సీఓఈలకు ప్రత్యేకమంటూ...

రాష్ట్రంలోని గురుకుల సొసైటీల పరిధిలోని అన్ని పాఠశాలల్లో ఇంటర్మీడియట్ వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఒక ప్రాంగణంలో ఐదో తరగతి నుంచి పదోతరగతి వరకు పాఠశాలలు నిర్వహిస్తుండగా.. జూనియర్ కాలేజీని ప్రత్యేక ప్రిన్సిపల్‌తో నిర్వహిస్తున్నారు. గురుకుల సొసైటీలకు పాఠశాలలతో పాటు ప్రతిభావంతులైన విద్యార్థుల కోసం సీఓఈల పేరిట ప్రత్యేక పాఠశాలలున్నాయి. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలో 38, ఎస్టీ గురుకుల సొసైటీ పరిధిలో 30, బీసీ గురుకుల సొసైటీ పరిధిలోని 12 సీఓఈల్లో ఇంటర్మీడియట్ తరగతులను పూర్తిస్థాయిలో నిర్వహిస్తున్నారు. ఈ మేరకు ఆయా సొసైటీ కార్యదర్శులు వేరువేరుగా ఉత్తర్వులు సైతం జారీ చేశారు. సీఓఈల్లోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఫస్టియర్ కేటగిరీకి మే 15వ తేదీ వరకు, సెకండియర్ విద్యార్థులకు మే 26వ తేదీ వరకు తరగతులు నిర్వహిస్తారు. ఆ తర్వాత మే 31వ తేదీ వరకు వేసవి సెలవులు ఇవ్వనున్నారు. ముందస్తుగా పాఠ్యాంశాన్ని ముగించేందుకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని నిర్ణయించినట్లు సొసైటీ కార్యదర్శులు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

అదే బాటలో ప్రైవేటు కాలేజీలు..

గురుకుల విద్యా సంస్థలు ఇంటర్మీడియట్ తరగతులను నిర్వహిస్తుండడంతో పలు ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలు సైతం ఇదే బాట పట్టాయి. ఇంటర్మీడియట్ బోర్డు ఇచ్చిన ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇష్టానుసారంగా తరగతులను నిర్వహిస్తున్నాయి. వేసవి సీజన్‌లో తీవ్రమైన ఎండలు, ఉక్కపోత ఉండగా కనీస ఏర్పాట్లు చేయకుండా పలు కాలేజీలు తరగతులు నిర్వహిస్తుండడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తరగతులకు హాజరు కాకుంటే సిలబస్ మిస్సవుతుందనే ఆందోళనతో తప్పనిసరి పరిస్థితుల్లో పంపుతున్నట్లు వాపోతున్నారు.

జిల్లా వార్తలు

రామయ్యకు గోటి తలంబ్రాల సమర్పణ



గోటి తలంబ్రాలు సమర్పిస్తున్న బెంగళూరు భక్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి కల్యాణోత్సవంలో వినియోగించే గోటి తలంబ్రాలను బెంగళూరుకు చెందిన భక్తులు గురువారం సమర్పించారు. ఏపీలోని కోరుకొండకు చెందిన శ్రీకృష్ణ చైతన్య సంఘం అధ్యక్షుడు కళ్యాణ అప్పారావు ఆధ్వర్యాన గత నాలుగేళ్లుగా గోటితో వలిచిన తలంబ్రాలను కల్యాణానికి సమర్పిస్తున్నారు. ఈ ఏడాది కూడా అప్పారావు ప్రత్యేకంగా పండించిన వరి పంటను బెంగళూరుకు చెందిన భక్తులకు పంపించగా.. వారు గోటితో వలిచి ప్రత్యేక పూజల అనంతరం అధికారులకు అందజేశారు.

పూలేకు ఘన నివాళి



పూలేకు నివాళులర్పిస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ, మాజీ మంత్రి తదితరులు

ఖమ్మం మయూరిసెంటర్: మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఖమ్మంలోని శ్రీశ్రీ సర్కిల్‌లో ఉన్న ఆయన విగ్రహం వద్ద గురువారం పలువురు నివాళులర్పించారు. ఎంపీ నామా నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తదితరులు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక మాట్లాడారు. ఆధునిక భారతదేశంలో సామాజిక న్యాయం, మహిళా సాధికారత ఉద్యమాలకు ఆద్యుడు పూలే అని గుర్తుచేశారు. చదువుతోనే సమన్యాయం, అభివృద్ధి సాధ్యమని నమ్మారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పి.నీరజ, కార్పొరేటర్ మక్బూల్, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, బీఆర్‌ఎస్ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, నాయకులు గుండాల కృష్ణ, తాళ్లూరి జీవన్‌కుమార్, దేవబత్తుని కిషోర్ బాబు, మోరంపూడి ప్రసాద్, కృష్ణప్రసాద్, సరిపుడి గోపి, తాజుద్దీన్, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక పల్లెల్లోనే నీటి పరీక్షలు

- గ్రామాలకు క్లోరోస్కోప్ కిట్లు పంపిణీ
- తాగునీటి నాణ్యత నిర్ధారణకు పరీక్షలు
- సురక్షిత నీటి సరఫరాపై ప్రభుత్వం దృష్టి
- ఇప్పటికే పంచాయతీ కార్యదర్శులకు అవగాహన



గ్రామపంచాయతీ కార్యదర్శులకు కిట్లు అందజేస్తున్న అధికారులు (ఫైల్)



సుజాతనగర్‌లో నీటి పరీక్ష చేస్తున్న ఉద్యోగులు



క్లోరోస్కోప్ కిట్

చుంచుపల్లి: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వివిధ పథకాల ద్వారా తాగునీరు సరఫరా అవుతోంది. అయితే, పైపులైన్ల లీకేజీలు, చేతిపంపుల చుట్టూ అపరిశుభ్రత నెలకొనడం వంటి పరిస్థితుల్లో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదముంటుంది. దీన్ని అరికట్టేందుకు గ్రామాల్లో తరచుగా నీటి నాణ్యతను పరీక్షించాల్సి ఉన్నా కిట్లు అందుబాటులో లేక సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యాన దాదాపు మూడేళ్ల తరువాత గ్రామాల్లో నీటి పరీక్షలు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం 'క్లోరోస్కోప్ వాటర్ క్వాలిటీ ఫీల్డ్ టెస్ట్' కిట్లను మిషన్ భగీరథ విభాగం ద్వారా గ్రామపంచాయతీలకు అందజేసింది. పరీక్షల నిర్వహణ బాధ్యతలను మిషన్ భగీరథ సహాయకులతో పాటు పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. గతంలోనూ గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యాన పంచాయతీలకు నాణ్యత పరీక్ష కిట్లు అందజేసినా చాలాచోట్ల మూలనపడ్డాయి. మళ్లీ ఇప్పుడు కిట్లు సమకూర్చగా... ప్రజలకు సరఫరా చేసే నీటిలో పీహెచ్, ఫ్లోరైడ్, నైట్రేట్, క్లోరైడ్, ఐరన్ శాతాలే కాక క్లోరినేషన్ స్థాయిని పరీక్షించి సరఫరా చేయనున్నారు. తద్వారా ఎక్కడ కూడా తాగునీరు కలుషితం కావడం వంటి సమస్యలు ఎదురుకావని చెబుతున్నారు.

నాణ్యత పరీక్ష ఇలా...

రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ విభాగం ద్వారా గ్రామపంచాయతీలకు క్లోరోస్కోప్ కిట్లు సరఫరా చేయగా.. వీటి ద్వారా పరీక్ష చేసే తీరుపై గ్రామపంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. క్లోరోస్కోప్ కిట్‌లో నీటిని పరీక్షించేందుకు ఉపయోగించే రియోజెంట్ రసాయనం, రెండు గాజు నాళికలతో పాటు ఒక బ్రష్, పరీక్షించిన నీటిలో క్లోరిన్ శాతం ఎంత మోతాదులో ఉందో తెలుసుకునేందుకు చార్ట్ ఉన్నాయి. ఒక గాజు నాళికలో 5 ఎం.ఎల్. నీటిని తీసుకుని అందులో నాలుగు చుక్కల రియోజెంట్ రసాయనం కలిపితే క్లోరిన్ ఎంత శాతం ఉందో తెలుస్తుంది. ఈమేరకు క్లోరిన్ 0.2 పీపీఎం నుంచి 1 పీపీఎం వరకు ఉంటే సురక్షితమైనదని చెబుతున్నారు. ఈ కిట్ల ద్వారా ప్రతి రోజు మూడు విభాగాలుగా నీటి నాణ్యత పరీక్షలు చేయాలని సూచించారు. నీరు విడుదలయ్యే ట్యాంకుల వద్ద, గ్రామం మధ్యలో ఉన్న కుళాయి వద్దే కాక చివరి నల్లా వద్ద పరీక్ష చేయాల్సి ఉంటుంది. అలాగే, గ్రామాల్లోని తాగునీటి నీటి ట్యాంకుల్లో పరిమాణానికి అనుగుణంగా బ్లీచింగ్ పౌడర్ కలపాలని సూచించారు.

జిల్లాల వారీగా వివరాలు

వివరం	భద్రాద్రి జిల్లా	ఖమ్మం జిల్లా
గ్రామపంచాయతీలు	481	589
గృహాలు	2.70 లక్షలు	2.92 లక్షలు
గ్రామీణ జనాభా	8,38,143	10,27,750
ఓవర్‌హెడ్ ట్యాంకులు	1,547	1,487
ఇంటింటి నల్లాలు	2,16,643	2,93,111
చేతి పంపులు	8,645	10వేలు

కార్యదర్శులకు అవగాహన కల్పించాం



ప్రతీగ్రామపంచాయతీకి క్లోరోస్కోప్ టెస్ట్ కిట్లు అందాయి. ఈ కిట్ల ద్వారా పరీక్షలు చేస్తూ అప్పటికప్పుడే నీటి నాణ్యతను గుర్తించడం వీలవుతుంది. వీటి వినియోగంపై గ్రామపంచాయతీల కార్యదర్శులు, సిబ్బందికి అవగాహన కల్పించాం. పలుచోట్ల ఇప్పటికే నాణ్యత పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. – నజీర్, మిషన్ భగీరథ ఉద్యోగి

పెరిగిన పత్తి విత్తనాల ధర

- ఒక్కో ప్యాకెట్‌పై రూ.11 పెంపు
- రూ.864కు చేరిన 475 గ్రాముల ప్యాకెట్ ధర
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 లక్షల ప్యాకెట్లు వినియోగం



పత్తి విత్తనాలు

ఖమ్మంవ్యవసాయం: రానున్న ఖరీఫ్ అవసరాలకు అమ్మనున్న పత్తి విత్తనాల ధరలు పెరిగాయి. 475 గ్రాములు ఉండే ఒక్కో ప్యాకెట్ ధర గత ఏడాదితో పోలిస్తే రూ.11 పెంచగా రూ.864కు చేరింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వరి తర్వాత అత్యధికంగా పత్తి సాగవుతుంది. ఉమ్మడి జిల్లాలో ఏటా దాదాపు 4.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగవుతుండగా.. గత ఏడాది మాత్రం వర్షాభావ పరిస్థితులతో సాగు విస్తీర్ణం తగ్గింది. ప్రస్తుత సంవత్సరం పత్తి ధర క్వింటాకు రూ.7 వేల వరకు ఉండగా.. గత రెండేళ్లు మాత్రం రూ.10 వేల నుంచి రూ.13 వేల వరకు పలికింది. దీంతో రైతులు రానున్న ఖరీఫ్‌లో పత్తి సాగుకు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు రైతులు అధిక దిగుబడి ఇచ్చే విత్తనాలను ఎంపిక చేసుకోవడంలో నిమగ్నమయ్యారు.

ఏడేళ్లుగా పైపైకి...

పత్తి విత్తనాల ధర ఏడేళ్లుగా పెరుగుతూ వస్తోంది. ఐదేళ్ల కాలంలో ఒక్కో ప్యాకెట్‌పై రూ.134 వరకు ధర పెరిగింది. 2020–21లో పత్తి విత్తన ప్యాకెట్ ధర రూ.730 ఉండగా, 2021–22లో రూ.767కు చేరింది. ఆతర్వాత 022–23లో రూ.43 పెంచగా.. 2023–24 సంవత్సరంలో మరో రూ.43 పెంచడంతో రూ.853కు ధర ఖరారైంది. ఇక ఈ ఏడాది(2024–25) మరో రూ.11లు పెంచడంతో పత్తి విత్తనాల ప్యాకెట్ ధర రూ.864గా నిర్ణయించారు.

4.50లక్షల ఎకరాల్లో సాగు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 4.50 లక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యే అవకాశముంది. ఇందులో ఖమ్మం జిల్లాలో 2.50 లక్షల ఎకరాలు, భద్రాద్రి జిల్లాలో 2లక్షల ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా. ఈమేరకు ఎకరాకు రెండు విత్తనాల ప్యాకెట్లు అవసరముండగా.. ఉమ్మడి జిల్లాలో రైతులు 11 లక్షల ప్యాకెట్లు అవసరమవుతాయని భావిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులు ఇప్పటి నుంచే రైతులకు సరిపడా విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడంపై దృష్టి సారించారు. సాధారణంగా మార్కెట్‌లో బీటీ–1, బీటీ–2 పత్తి విత్తనాలను అమ్ముతుండగా.. రైతులు మాత్రం బీటీ–2 పైనే మక్కు కనబరుస్తారు. దీంతో వివిధ కంపెనీలకు చెందిన పత్తి విత్తనాలు దిగుమతి చేసుకునేందుకు వ్యాపారులు సిద్ధమవుతున్నారు.

సింగరేణిలో సీపీఆర్‌ఎంఎస్–ఎన్‌ఈ ట్రస్ట్ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ శ్రీనివాస్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయంలో 7వ సీపీఆర్‌ఎంఎస్ – ఎన్‌ఈ ట్రస్ట్ సమావేశం ట్రస్టీ అధ్యక్షుడు, డైరెక్టర్(పా) ఎన్వీకే.శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈసమావేశంలో గుర్తింపు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ పాల్గొన్నారు. తొలుత కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్(సీపీఆర్‌ఎంఎస్) గత ఆర్థిక సంవత్సరం లావాదేవీల ఆడిట్‌ను ఆమోదించారు. ఆతర్వాత గత ఏడాది నుండి ఇప్పటి వరకు మారిన ట్రస్ట్ సభ్యుల స్థానంలో కొత్త వారిని ఆమోదిస్తూ నిర్ణయించారు. అలాగే, విశ్రాంత ఉద్యోగులు తీవ్రమైన వ్యాధులతో బాధపడుతుంటే సీపీఆర్‌ఎంఎస్ కార్డ్‌పై ఇచ్చే రూ.8 లక్షల్లో కాకుండా విడిగా చూడాలని, ఇప్పటికే ఉపయోగించుకున్న మొత్తాన్ని మినహాయించి అర్హత ఆధారంగా ప్రయోజనం కలిగేలా చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా కార్పస్ ఫండ్ విషయంలో కార్మికులు త్వరగా చెల్లించాలని, లైఫ్ సర్టిఫికెట్ సమర్పించని వారు వెంటనే మొబైల్ అప్లికేషన్ ద్వారా కానీ మీ సేవా సెంటర్‌లో కానీ రెన్యూవల్ చేయించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కాగా, ఈ సమావేశంలో గుర్తింపు సంఘం అధ్యక్షుడు సీతారామయ్య మాట్లాడుతూ యాజమాన్యం సీపీఆర్‌ఎంఎస్–ఎన్‌ఈ అసలు కంట్రిబ్యూషన్‌తోపాటు వడ్డీ కూడా ట్రస్ట్‌కు జమ చేయాలని, ఉద్యోగ విరమణ చేసే నాటికి మెడికల్ కార్డ్ ఇవ్వాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో జీఎంలు కట్టా బసవయ్య, కవితానాయుడు తదితరులు పాల్గొన్నారు.

బండెనక బండి కట్టి...



పెద్దసంఖ్యలో జేసీబీలను తీసుకెళ్తున్న గూడ్స్ రైలు ఖమ్మం రైల్వేస్టేషన్‌లో గురువారం కాసేపు ఆగింది. అదేసమయాన వివిధ రైళ్లుఎక్కేందుకు వచ్చిన ప్రయాణికులు గూడ్స్‌పై బారులుగా ఉన్న జేసీబీలను ఆసక్తిగా తిలకించారు. – ఖమ్మం స్పోర్ట్స్